

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

బడంగ్‌పేట్ డివిజన్లలో దశలవారీగా అభివృద్ధి పనులు

- మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి తెలిపారు. నాదర్‌గుల్ 31వ డివిజన్‌లోని సాయిబాలాజీకాలనీ ఫేజ్-2లో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లో అందుబాటులో ఉన్న నిధులతో ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం ఆమె అదే డివిజన్‌లోని శ్రీవిద్యా టౌన్‌షిప్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. తమ కాలనీలోని రోడ్లు అభివృద్ధి చేయాలని స్థానికులు కోరగా ఆ దిశలో చర్యలు తీసుకుంటామని పారిజాతారెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ పీ.సుదర్శన్‌రెడ్డి, డీఈఈ యాదయ్య, ఏఈ బిక్కూనాయక్, నాయకులు చంద్రపాల్‌రెడ్డి, రాముగౌడ్, మల్లికార్జునశర్మ పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్, ఏఈ మాత్రునాయక్

రోడ్డు పనుల పరిశీలన

కొత్తపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అధికారులకు సూచించారు. ఎస్‌ఆర్‌ఎల్‌కాలనీ - బృందావన్‌కాలనీ దారిలో నిర్మించిన బాక్స్‌డ్రెయిన్ పనులతో పాడైన దారిలో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. బుధవారం ఆయన జీహెచ్ఎంసీ ఏఈ మాత్రునాయక్‌తో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు. అదేవిధంగా మారుతీనగర్‌లో వచ్చే ఆదివారం జరిగే బోనాల ఉత్సవాలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, రహదారులపై వర్షం నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.



ప్రగతి చక్రం అవార్డులను అందజేస్తున్న డీఎం విజయ్‌కుమార్

ప్రగతి చక్రం అవార్డుల అందజేత

చంపాపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్‌లోని మిధానీ టీఎస్ఆర్టీసీ బస్‌డిపోలో జూన్‌లో అత్యధిక ఈపీకే, కేఎంపీఎల్‌లో ప్రతిభ కనబరిచిన పలువురి సిబ్బందికి బుధవారం డిపో మేనేజర్ పీ.విజయ్‌కుమార్ ప్రగతి చక్రం అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది ప్రతినెల ఉత్తమ అవార్డులు స్వీకరించేందుకు పోటీపడాలని కోరారు. డిపో లెవల్‌తో పాటు డివిజినల్, రీజినల్ లెవల్‌లో ఈపీకే, కేఎంపీఎల్‌లో అవార్డులు సాధించాలని కోరారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాద రహిత అవార్డులను అందుకుంటున్న డ్రైవర్లు

ముగ్గురు ప్రమాద రహిత డ్రైవర్లకు అవార్డులు

చాదర్‌ఘాట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లలో ముగ్గురు డ్రైవర్లు ప్రమాద రహిత డ్రైవర్లుగా ఎంపికయ్యారని డిపో మేనేజర్ సమత ప్రకటించారు. బుధవారం ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ చేతుల మీదుగా డ్రైవర్లు టీ.అరుణ్‌కుమార్, ఎ.సూర్యకుమార్, ఆర్.రాములు ప్రమాద రహిత డ్రైవర్లుగా అవార్డులను అందుకున్నారు. ఈసందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ బస్సు నడిపే సమయంలో ఏకాగ్రత చాలా ముఖ్యమన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదన్న నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటూ ప్రమాద రహిత డ్రైవర్లుగా గుర్తింపు పొంది అవార్డులను అందుకోవడం అభినందనీయమని ఆయన అన్నారు. లక్షే లక్ష్యం అవార్డులను ముగ్గురు డ్రైవర్లు, ముగ్గురు కండక్టర్లు అందుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వెంకన్న, ఎంఎఫ్ వెంకటేశ్, సిబ్బంది జె.అశోక్, ఎంవీఎస్‌రావు, లలిత, బుచ్చిరెడ్డి, శృతి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం గ్రేటర్ జోనల్ కమిటీ అధ్యక్షుడిగా ఆనందం



ఆనందంను అభినందిస్తున్న రాష్ట్ర నాయకులు

చాదర్‌ఘాట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎం.ఆనందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జోనల్ చైర్మన్‌గా బీవీ భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్.నాగేశయ్య, కార్యదర్శిగా కె.నిరంజన్, పబ్లిసిటీ సెక్రెటరీగా కె.అశోక్, కోశాధికారిగా ఎస్.లలిత ఎన్నికయ్యారు. సంఘం వ్యవస్థాపకులు థామస్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాసులు అధ్యక్షతన జోనల్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సీనియర్ నాయకులు కత్తుల యాదయ్య, బుద్ధ విశాల్, కోశాధికారి మధుసూదన్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరకాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఏకగ్రీవం

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ పరిధిలోని వెంకటేశ్వరకాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా మొద్దు బస్వారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చలకాని గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారిగా చిత్తలూరి నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా కట్ట సత్యనారాయణరెడ్డి, లీగల్ అడ్వైజర్‌గా జల్లా చిరంజీవులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని 24వ వార్డు కౌన్సిలర్ అనుపమాసుప్రసేనారెడ్డి అభినందించారు. ఈ కమిటీ రెండేళ్ల పాటు కొనసాగుతుందని అధ్యక్షుడు తెలిపారు.

హైడ్రా అయితే మాకేంటీ..!



ఈదులచెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టితో నింపివేసిన దృశ్యం

- పెద్దఅంబర్‌పేట్ ఈదులచెరువు ఎఫ్‌టీఎల్ యథేచ్ఛగా పూడ్చివేత
- సుమారు ఎకరా ఎఫ్‌టీఎల్ చుట్టూ కంచెకు ఏర్పాట్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



ఎఫ్‌టీఎల్ పరిధిలో కంచె కోసం చేసిన ఏర్పాట్లు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం కాంగ్రెస్ సర్కార్ హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ముఖ్యంగా ప్రభుత్వ భూములతో పాటు చెరువులు, కుంటలు, నాలాల కబ్జాలను చెక్ పెట్టేందుకు స్పెషల్ టీంలను నియమించింది. అయినా ఔటర్ పరిధిలోని చెరువు, కుంటలతో పాటు నాలాల ఆక్రమణలు ఆగడం లేదు. హైడ్రా అయితే మాకేంటీ అన్న తీరులో కబ్జాదారులు యథేచ్ఛగా చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లతో పాటు నాలాలను కబ్జా చేస్తూనే ఉన్నారు. రాత్రికి రాత్రి వాటిని మట్టితో పూడ్చివేసి తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. అయినా ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

ఇదే నిదర్శనం..

పెద్దఅంబర్‌పేట్ సర్వేనంబర్ 292లో సుమారు 130ఎకరాల్లో ఈదుల చెరువు విస్తరించి ఉంది. హయత్‌నగర్, మునగనూర్, తొర్రూర్‌తో పాటు పై కాలనీల నుంచి వచ్చే వరద నీటితో చెరువు కళకళలాడుతోంది. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు పట్టా సర్వే నంబర్‌తో పాటు సర్వే నంబర్ 292లోని సుమారు ఎకరా చెరువు స్థలాన్ని కబ్జా చేశారు. దాన్ని మట్టితో పూర్తిగా నింపేశారు. ప్రస్తుతం ఆ భూమిలో మొక్కలు నాటేందుకు గుంతలు తీయించారు. అదేవిధంగా చుట్టూ పెన్సింగ్‌తో పాటు గేటు నిర్మాణం ఏర్పాట్లు చేశారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇరిగేషన్ శాఖలోని కొందరు అధికారులు కబ్జాదారులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని కొందరు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పెడచెవిన పెట్టారని ఆరోపించారు. ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం పట్ల పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెరువు కబ్జాకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని ఎఫ్‌టీఎల్, బఫర్ హద్దులను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చెరువుల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హైడ్రా అధికారులైనా కబ్జాల భారీ నుంచి ఈదుల చెరువును కాపాడుతారో లేదో వేచిచూడాలి.

రోడ్లపై డ్రైనేజీ పరుగులు.. వీధుల్లో కుక్కలు, పందులు

- బడంగ్‌పేట్ శ్రీమారుతీనగర్‌వాసుల ఆవేదన
- సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



కమిషనర్ రఘుకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ అధ్యక్షుడు నరేశ్ తదితరులు

సరూర్‌నగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): రోడ్లపై పారుతున్న మురుగు నీటితో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తున్నదని, వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు, పందులు స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నాయని బడంగ్‌పేట్ కార్పొరేషన్ 28వ డివిజన్‌లోని శ్రీమారుతీనగర్ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సదరు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.నరేశ్ ఆధ్వర్యంలో స్థానికులు మునిసిపల్ కమిషనర్ రఘును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీలోని రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని, డ్రైనేజీ వ్యవస్థ సైతం లేకపోవడంతో ఇళ్లలోని మురుగు నీరంతా రోడ్లపై పారుతున్నదని వాపోయారు. కాలనీలోని వీధుల్లో కుక్కలు, పందులు గుంపులుగా తిరుగుతున్నాయని, వాటి భయానికి మహిళలు, చిన్న పిల్లలు వీధుల్లోకి రావాలంటేనే భయపడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కుక్కలు, పందుల బెడద నుంచి తమను కాపాడాలని వారు కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు ప్రదీప్, మోహన్, భిక్షపతి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘటాల ఊరేగింపు



ఘటాల ఊరేగింపులో పూసల సంఘం నేతలు

సైదాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లో మంగళవారం రాత్రి పూసలసంఘం నేత పసుపులేటి అమర్‌నాథ్ ఆధ్వర్యంలో ఘటాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ ఊరేగింపు పూసలబస్తీ, కుర్మబస్తీ నుంచి ఏకలవ్యనగర్ రెడ్డిబస్తీ మీదుగా సాగింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు కావేటి ధర్మరాజు, బీఎన్‌రాజు, పూసలసంఘం నేతలు వెంకటశర్మ, రవికుమార్, చక్రధర్ పాల్గొన్నారు.

మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

బోనాల వేడుకలు ముగింపులో భాగంగా శ్రద్దాబాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సైదాబాద్ శివాజీ చౌక్ వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, అధ్యక్షుడు కె.మల్లేశ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కడారి రాంకుమార్, ప్రధాన కార్యదర్శి జీ. శ్రీనివాస్‌చందర్జీ, ఉపాధ్యక్షులు సహదేవ్‌యాదవ్, సంగోది పరమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రగ్స్ బారిన పడితే జీవితం అంధకారమే

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి
- రేవ్‌పార్టీ నిందితులకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్



మాట్లాడుతున్న కమల్‌హాసన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/ఘట్‌కేసర్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఒక్కసారి డ్రగ్స్ బారిన పడితే జీవితం అంధకారం అవుతుందని తల్లిదండ్రులు, పిల్లలు తెలుసుకోవాలని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి సూచించారు. ఇటీవల మాదాపూర్ రేవ్‌పార్టీలో డ్రగ్స్ వినియోగిస్తూ ఎక్సైజ్ పోలీసులకు చిక్కిన నిందితులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో బుధవారం ఆయన కౌన్సెలింగ్ చేశారు. భవిష్యత్తులో డ్రగ్స్ మహమ్మారి జోలికి పిల్లలు వెళ్లకుండా చూస్తామని హామీ ఇస్తేనే విముక్తి కల్పిస్తామన్నారు. ఇక నుంచి పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటామని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు హామీ ఇచ్చారు. అబ్కారీ భవన్‌లో జరిగిన కౌన్సెలింగ్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి, అడిషనల్ ఎస్పీ భాస్కర్‌గౌడ్, ఎస్ఎఫ్‌టీ టీమ్ లీడర్ ప్రదీప్‌రావు, డీఎస్పీ తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం వినియోగిస్తే అనుమతి తప్పనిసరి

ఫంక్షన్ హాళ్లు, రిసార్టుల్లో నిర్వహించే బర్త్‌డే పార్టీలు, ఇతర శుభకార్యాల్లో మద్యం వినియోగిస్తే తప్పనిసరిగా ఎక్సైజ్ శాఖ అనుమతి తీసుకోవాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమల్‌హాసన్‌రెడ్డి సూచించారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన 'రిసార్ట్‌పై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు' వార్తకు ఆయన స్పందించారు. మేడ్చల్ జిల్లా అంకుషాపూర్‌లోని ది కాంటినెంటల్ రిసార్ట్‌లో సోమవారం అర్ధరాత్రి బి గ్‌బాస్ ఫేమ్ మహబూబ్ ఇచ్చిన బర్త్‌డే పార్టీలో టీవీ నటులు, సెలబ్రెటీ లు పాల్గొని అనుమతి లేకుండా మద్యం వినియోగించిన విషయం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

3 నుంచి హైదరాబాద్‌లో సాహిత్యోత్సవ్ జష్న్-ఏ-ఆదాబ్



ఖవ్వాలి నిర్వహిస్తున్న కళాకారులు

హైదరాబాద్ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హిందుస్తానీ కళలు, సంస్కృతి, సాహిత్యాన్ని వేడుక చేసే అతిపెద్ద సాంస్కృతిక కార్యక్రమాల్లో ఒకటైన సాహిత్యోత్సవ్ జష్న్-ఏ-ఆదాబ్ కల్చరల్ కార్వాన్ విరాసత్ మొదటిసారిగా హైదరాబాద్‌లో జరగనుంది. ఈ కార్యక్రమం ఆగస్టు 3, 4 తేదీల్లో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ)లో జరగనుంది. ఈ సాంస్కృతికోత్సవాల విశేషాల గురించి జష్న్-ఏ-ఆదాబ్ వ్యవస్థాపకుడు కున్వర్ రంజీత్ చౌహాన్ మాట్లాడుతూ 'పలు రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం అద్భుత విజయం సాధించిన తర్వాత తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చింది. ఈ సాంస్కృతికోత్సవంలో దక్కనీ ఉర్దూపై పర్షియన్ ప్రభావంపై చర్చతో పాటుగా డాక్టర్ విద్యా షా గజల్స్, వార్సీ బ్రదర్స్ ఖవ్వాలి, యామినీరెడ్డి నృత్యప్రదర్శన, ఉర్దూలో శ్రీమద్ భగవద్గీత పఠనం వంటివి ఉంటాయి. దేశవ్యాప్తంగా సుప్రసిద్ధ కవులు, గాయకులు, కళాకారులు పాల్గొననున్న ఈ కార్యక్రమంలో సాహిత్య, కళాభిమానులు పాల్గొనవచ్చు' అని తెలిపారు.

కీర్తన ఫౌండేషన్‌కు నిత్యావసర వస్తువుల అందజేత



కీర్తన ఫౌండేషన్‌కు నిత్యావసర వస్తువులను అందజేస్తున్న విఠల్‌రెడ్డి

చంపాపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ జడ్పీరోడ్‌లోని కీర్తన ఫౌండేషన్‌కు బుధవారం నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి నిత్యావసర వస్తువులను వితరణగా అందజేశారు. హస్తినాపురం సెంట్రల్‌కాలనీలోని నాగార్జున మాంటిస్సోరీ ఐఐటీ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు చారిటీ డేను నిర్వహించారు. విద్యార్థులు సేకరించిన నిత్యావసర వస్తువులకు తోడుగా పాఠశాల యాజమాన్యం కలిపి ఆరు క్వింటాళ్ల బియ్యం, రెండు క్వింటాళ్ల కందిపప్పును అనాథ ఆశ్రమానికి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో జీ.రజిని విఠల్‌రెడ్డి, ఏ.శేషారావు, ఎస్.రాజశేఖర్, కె.విజయ్‌కుమార్‌రావు, సవిత, పుష్పలత, అరుణ, దివ్య, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

అబేండ్కర్ సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారోత్సవంలో అబేండ్కర్ సంఘం నూతన కమిటీ సభ్యులు

వనస్థలిపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ అంబేడ్కర్ సంఘం నూతన కమిటీ సభ్యులు బుధవారం జైపురికాలనీలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో నాగోల్ మాజీ సర్పంచ్ గోల్కొండ మైసయ్య ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కత్తుల అనీల్‌కుమార్ మాట్లాడుతూ సంఘంలోని సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంఘం కోశాధికారి డప్పు సాయికుమార్, ఉపాధ్యక్షులు వేణుగోపాల్, సాయిరాం, శివకుమార్, నర్సింహ, పరమేష్ పాల్గొన్నారు.

నాగోల్‌లో ఇద్దరు మహిళలు అదృశ్యం



కొత్తపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నాగోల్ పీఎస్ పరిధిలో ఇద్దరు మహిళలు ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాని సంఘటనలు జరిగాయి. ఎస్‌హెచ్‌ఓ ఎస్ సుధీర్‌కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. యెన్నెం రామ్మూర్తి, పాము సాంబలక్ష్మి(51) దంపతులు మమతానగర్ సాయిశ్రేష్ట ఎన్‌క్లేవ్‌లో ఉంటున్నారు. సాంబలక్ష్మికి ఏడేళ్లుగా మతి స్థిమితంగా ఉండడంలేదు. ఆయనకూ ఆరోగ్యం సరిగా ఉండకపోవడంతో ఇంటి వద్దే ఉంటున్నారు. సాంబలక్ష్మి జూలై 30వ తేదీన ఉదయం 6.30 గంటలకు ఇంటి నుండి బయటకు వెళ్లినట్లు ఆయన గుర్తించారు. ఆమె ఆచూకీ కోసం తెలిసిన వారితో కలిసి రామ్మూర్తి అంతటా యత్నించినా ఫలితం దక్కలేదు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భర్తతో గొడవపడి..



నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం కొండన్‌పల్లికి చెందిన తండరుపల్లి ఇస్తారి, తండరుపల్లి లక్ష్మమ్మ(45) దంపతులు నాగోల్ సాయినగర్‌లో ఉంటున్నారు. లక్ష్మమ్మ ఖైరతాబాద్‌లోని దక్కన్ గ్రామీణ బ్యాంకులో అటెండరుగా పనిచేస్తోంది. కొండన్‌పల్లిలో వారికి కొంత వ్యవసాయ భూమి ఉంది. సదరు భూమి వివాదం విషయమై ఇద్దరి మధ్య తరచూ గొడవ జరిగేది. జూలై 29న వారిద్దరి మధ్య భూమి విషయంపై గొడవ జరిగింది. మరుసటి రోజు సాయంత్రం లక్ష్మమ్మ చెత్త, వ్యర్థాలు బయట పారబోసి వస్తానని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడు ఆమె ఆచూకీ కోసం అంతటా వెతకినా ప్రయోజనం కనిపించలేదు. బుధవారం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి కుప్పలు ఇలా.. వెళ్లేదెలా..!



పెద్దఅంబర్‌పేట్ నుంచి మునగనూర్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ఆ రోడ్డు మరమ్మతుల కోసం మట్టి కుప్పలను ఇలా నడిరోడ్డులో పోసి చదునుచేయకుండా వదిలేశారు. అది తెలియక ఆ రోడ్డులో వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బైక్‌లు ఎలాగోలా వెళ్లిపోగా పెద్ద వాహనాలు అక్కడి నుంచి వెనకకు తిరిగి వెళ్లాయి. అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు. - అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి



మాట్లాడుతున్న ఎంవీఐ మున్నీ

ట్రాఫిక్ నియమాలను పాటిస్తే ప్రమాదాలు అరికట్టవచ్చు

- మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మున్నీ

హయత్‌నగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమాలను పాటిస్తే ప్రమాదాలు అరికట్టవచ్చునని ఇబ్రహీంపట్నం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మున్నీ అన్నారు. బుధవారం హయత్‌నగర్ బస్ డిపో -1లో నిర్వహించిన ప్రమాద రహిత వారోత్సవాల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షితంగా డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరగవని అన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు చేయని డ్రైవర్లను ఆమె సన్మానించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సుచరిత, డిపో మేనేజర్ విజయ్, సహాయ మేనేజర్ విజయకుమారి, నరేష్, జంగయ్య పాల్గొన్నారు.



కృష్ణయ్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న గిరి

అభాగ్యుడిని చేరదీసి.. కుటుంబ సభ్యులకు అప్పగింత

సరూర్‌నగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల క్రితం నగరంలోని సుల్తాన్‌బజార్‌లో రోడ్లపై తిరుగుతున్న మతిస్థిమితంలేని వ్యక్తిని బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని మాతృ దేవోభవ అనాథాశ్రమం నిర్వాహకుడు గట్టు గిరి చేరదీసి, సపర్యలు చేసి, వైద్య సేవలు అందించి మామూలు మనిషిగా మార్చాడు. అతడి వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో కొందరు వ్యక్తులు గుర్తు పట్టి అతడి కుటుంబ సభ్యులకు చెప్పారు. వారు గిరికి ఫోన్ చేసి అతడి పేరు కందుకూరి కృష్ణయ్య అని, మహబూబ్‌నగర్ జిల్లా నర్వ మండలంలోని రైకోడ్ గ్రామమని చెప్పి, బుధవారం ఆశ్రమానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు గిరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం గిరి వారికి కృష్ణయ్యను అప్పగించారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆందోళన చేస్తున్న క్యాబ్ డ్రైవర్లు

ఇతర రాష్ట్రాల క్యాబ్‌లను అనుమతించొద్దు..

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రెండోరోజు కొనసాగిన ఆందోళన

శంషాబాద్ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాలకు చెందిన క్యాబ్‌లకు అనుమతివ్వొద్దని డిమాండ్ చేస్తూ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో క్యాబ్‌డ్రైవర్లు చేపట్టిన ఆందోళన బుధవారం రెండోరోజు కూడా కొనసాగింది. ఈ సందర్భంగా క్యాబ్ డ్రైవర్ల యూనియన్ నాయకులు మాట్లాడుతూ కొందరు వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి క్యాబ్‌లను తీసుకొచ్చి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నడిపించి తమ జీవనాధారాన్ని దెబ్బ తీస్తున్నారని, తాము రోడ్డున పడే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇంతకుముందు జీఎంఆర్ అధికారులుకు, పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇతర రాష్ట్రాలకు చెందిన క్యాబ్‌లను ఎయిర్‌పోర్టులోకి అనుమతిని రద్దుచేసే వరకు పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు. అధికారులు సమస్యను పరిష్కరించకపోతే మున్ముందు ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

రిటైర్డ్ పోలీసు ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు



రిటైరయిన ఉద్యోగులను సన్మానిస్తున్న సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ : హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పదవీ విరమణపొందిన 36 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి బుధవారం సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం పోలీసుశాఖ నుంచి రావలసిన అన్నిరకాల రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామని, పోలీస్ శాఖ తరఫున మీకు, మీ కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ అడ్మిన్ జె.పరిమళ హానా నూతన్, చీఫ్ అకౌంట్స్ అధికారి శ్రీనివాస్, ఏడీఓ శ్రీదేవి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు యన్.శంకర్‌రెడ్డితో పాటు పలువురు పోలీసు అధికారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో బుధవారం పదవీ విరమణ పొందిన 8 మంది ఉద్యోగులను జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ఘనంగా సన్మానించారు.